సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 17 । జనవరి । 2025



దూడల పోషణలో జాగ్రత్తలు

అధిక ధరకు పాడి గేదెలు కొనడానికి బదులు మేలు జాతి దూడలను పాడి గేదెలుగా వృద్ధి చేసుకుంటే పశువుల కొనుగోలుకు అయ్యే వ్యయాన్ని తగ్గించుకోవచ్చు. 8లో ▸



హోరాహోరీగా కబడ్డీ పోటీలు

రుస్తుంబాదలో జాతీయస్థాయి మహిళలు, పురుషుల కబడ్డీ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. గెలుపొందిన జట్లకు రూ. 7.50 లక్షలు ప్రైజ్‌మనీ ఇస్తారు. 8లో ▸



'సాగర్' నీటి కష్టాలు

నూజివీడు నియోజకవర్గంలో రబీ పంటల సాగుకు అవసరమైన సాగర్ జలాల సరఫరాపై రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. 8లో ▸

జూదంలో యువత చిత్తు

- కోడిపందేలు, గుండాటతో జేబులు చిల్లు
- లోన్ యాప్‌ల నుంచి, అప్పులు చేసి పందేలు కాసిన వైనం
- జిల్లాలో రూ.70 కోట్లు ఖర్చుపెట్టిన యువత

భీమవరానికి చెందిన మహేష్ (పేరు మార్చాం) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. సంక్రాంతికి సొంతూరు వచ్చి కోడి పందేల్లో పాల్గొని రూ.లక్ష వరకు పోగొట్టుకున్నాడు. రెండు నెలల జీతం సొమ్మును కేవలం మూడు రోజుల్లో జూదంలో సమర్పించుకున్నాడు. సంక్రాంతి మూడు రోజులు ఎంజాయ్ చేయడం ముఖ్యం, డబ్బు ముఖ్యం కాదని అతను చెప్పడం కొసమెరుపు.

భీమవరానికి చెందిన సాయి (పేరు మార్చాం) ప్రైవేట్ ఉద్యోగి. జీతం తక్కువ అయినప్పటికీ కోడి పందేలు, గుండాటల కోసం లోన్ యాప్‌ల్లో, మరికొంత అప్పు చేశాడు. మొదటి రోజు పందేల్లో కొంత వరకు గెలిచినా.. మిగతా రెండు రోజుల్లో రూ.లక్ష పోగొట్టుకున్నాడు.

భీమవరం (ప్రకాశం చౌక్): సంక్రాంతి సంబరాల ముసుగులో జూదం యువతను చిత్తు చేసింది. జేబులకు చిల్లు తప్పదని తెలిసినా.. జనం జూదం ముందు ఓడిపోయారు. సంక్రాంతి మూడు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా జరిగిన కోడి పందేలు, గుండాటలు, పేకాటల్లో యువత భారీగా పాల్గొని రూ. కోట్లలో నష్టపోయింది.

అధిక సంఖ్యలో యువతే.. గతంలో కోడి పందేలు, గుండాటలు అంటే పెద్ద వారు అధిక సంఖ్యలో ఉండేవారు. యువత సంక్రాంతికి ఏర్పాటు చేసే క్రికెట్, వాలీబాల్, ఇతర క్రీడాల్లో ఎక్కువగా ఉండేది. రాను రాను యువత ఎక్కువ సంఖ్యలో కోడి పందేలు, గుండాటల వైపు మళ్లుతున్నారు. ఈ సంక్రాంతి మూడు రోజులు అదే జరిగింది. కోడి పందేలు, గుండాటల్లో యువత చాలా పెద్దసంఖ్యలో పాల్గొంది. 18 నుంచి 35 ఏళ్ల వయసున్న వారు. కోడి పందేలు, గుండాటల్లో పాల్గొన్నారు. ఎక్కడ ఏ కోడి పందేల బరి చూసిన యువత ఎక్కువగా కనిపించింది. పెద్ద వారు కోడి పందేలు తిలకించడానికి పరిమితంకాగా యువత కోడికి కత్తి



బరి వద్ద చిన్న బజార్- పెద్దబజార్ జూదం (ఫైల్)



భీమవరం మండలంలో జోరుగా సాగిన కోడిపందేలు (ఫైల్)

కట్టడం దగ్గర నుంచి పందేలు సరిపెట్టడం వరకు అన్ని చూసుకున్నారు. కొన్ని చోట్ల అమ్మాయిలు కూడా ఈ జూదాల్లో పాల్గొన్నారు. హైదరాబాద్, బెంగుళూరు, విజయవాడ, విశాఖపట్నం నుంచి వచ్చిన సాఫ్ట్‌వేర్, ఇతర ఉద్యోగులు, వ్యాపారం చేస్తున్న యువత డబ్బు లెక్క చేయకుండా ఉత్సాహంగా కోడి పందేలు, గుండాటల్లో పాల్గొంది.

రూ.70 కోట్లకు పైగా చేతులు మారిన నగదు

జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల జరిగిన కోడి పందేలు, గుండాటలు, ఇతర జూదాల్లో యువత రూ. 70 కోట్లు మంచినీళ్లలా ఖర్చుపెట్టింది. నూటికి 10 శాతం మంది యువత పందేల్లో డబ్బులు గెలిస్తే.. 90 శాతం పందేల్లో భారీగా పోగొట్టుకున్నారు. రోజుకు ఒక్కొక్కరు రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు, గ్రూపుగా రోజుకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు పందేలపై కాశారు. జేబుల్లో డబ్బు లేని వారికి నిర్వాహకులు ప్రత్యేకంగా మనుషులను పెట్టి క్యాష్ ఏర్పాటు చేయించారు. ఫోన్ పే, గూగుల్‌పే సౌకర్యం కల్పించి క్యాష్ అందించేవారు.

లోన్ యాప్‌ల బారిన యువత : కోడి పందేలకు అవసరమైన నగదు కోసం యువత ముందుగానే పలు రకాల లోను యాప్‌ల నుంచి రుణాలు తీసుకుని పందేలు కాశారు. మరికొందరు అధిక వడ్డీకి అప్పులు చేశారు. వస్తువులు తాకటపెట్టి మరి ఈ జూదాల్లో డబ్బులు పోగొట్టుకున్నారు. సంక్రాంతి పండగ ముగిసింది. ఇక చేసిన అప్పులు తీర్చడం ఎలా ఆందోళన యువతలో మొదలైంది.



భీమవరం ప్రాంతంలో క్యాసినో జూదం నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

మూడు చోట్ల క్యాసినోలు

భీమవరం: సంక్రాంతి సంబరాల పేరుతో కోడి పందేలు, జూదాలే కాకుండా క్యాసినోలు ఆడడం చర్చనీయాంశంగా మారింది. భీమవరం పట్టణం, వీరవాసరం, భీమవరం మండలాల్లో మూడు చోట్ల క్యాసినోలు నిర్వహించినట్లు టీడీపీ నాయకుడే పబ్లిక్‌గా చెప్పారు. పండుగలో క్యాసినో నిర్వహిస్తే తప్పేమిటని సమర్థించడం విశేషం. పండుగకు వారం రోజులు ముందుగా కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం అస్మి కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయినప్పటికీ విచ్చల విడిగా పందేలతోపాటు పేకాట, గుండాట, క్యాసినోలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల పేరుతో డ్యాన్స్ ప్రోగ్రాంలు నిర్వహించినా పోలీసు శాఖ అడ్డుకున్న దాఖలాలు లేవు.

భీమవరం నియోజకవర్గంలో..

భీమవరం నియోజకవర్గంలోని మూడు ప్రాంతాల్లో క్యాసినో నిర్వహించినట్లు తెలుస్తోంది. ఒక ప్రాంతంలో సాక్షాత్తు ఒక ప్రజాప్రతినిధి తనయుడే దీనికి నాయకత్వం వహించినట్లు చెబుతున్నారు. కోడిపందేల బరుల వద్ద పెద్ద మొత్తంలో సొమ్ములు తీసుకున్న నాయకులు క్యాసినో వంటి జూదం నిర్వహించడంపై పలువురు కూటమి పార్టీల నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. క్యాసినో వంటి జూద క్రీడ నిత్యం ఆడిస్తే వస్తే అనేక కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్‌రీల్

జాతీయ వర్క్‌షాపునకు హాజరైన రవీంద్రనాథ్



వర్క్‌షాపులో పాల్గొన్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

తణుకు అర్బన్: ఢిల్లీలో జరిగిన శాసన సభలు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, బడ్జెట్‌లో ఎలాంటి ప్రభావాలు చూపుతున్నాయనే అంశంపై నిపుణులతో నిర్వహించిన జాతీయ వర్క్ షాప్‌లో శాసన మండలి సభ్యుడు వంక రవీంద్రనాథ్ పాల్గొన్నారు. వివిధ అంశాలకు సంబంధించి ఆర్థిక నిపుణులతో చర్చించినట్లు ఆయన వివరించారు. ఈ వర్కు షాపులో పలువురు ప్రముఖులతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి 72 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

ఎస్‌ఆర్‌కేఆర్‌లో హ్యాకథాన్ పోటీ



పోటీల పోస్టర్ ఆవిష్కరణ దృశ్యం

భీమవరం: భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫిబ్రవరి 17, 18 తేదీలలో జాతీయ స్థాయి ప్రజ్వలన్ 2కే25 పేరిట హ్యాకథాన్ పోటీ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు చెప్పారు. హ్యాకథాన్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ కళాశాలలో ఆవిష్కరించారు. రిజిస్ట్రేషన్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు.

నైపుణ్యాభివృద్ధి పెంపునకు పీఎం ఇంటర్న్‌షిప్

భీమవరం (ప్రకాశంచౌక్): రానున్న ఐదేళ్లలో సుమారు కోటి మందికిపైగా యువతకు పీఎం ఇంటర్న్‌షిప్ పేరిట అవకాశం కల్పిస్తున్నారని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టారని, టాప్-500 కంపెనీల్లో ఈ పథకం ద్వారా యువతకు అవకాశాలు కలుగుతాయన్నారు. జనవరి 14 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని, ఈ నెల 21 వరకూ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.5 వేల చొప్పున ఏడాదికి రూ.60 వేల ఉపకార వేతనం లభిస్తుందని, ఏదైనా కంపెనీలో చేరే ముందు అందజేసే రూ.6 వేలు (వన్ టైం గ్రాంట్) కూడా అందుతుందన్నారు. ఈ పథకానికి సంబంధిత వెబ్‌సైట్‌లో అయ్యి రిజిస్టర్ అవ్వాలన్నారు. 21-24 మధ్య వయసున్న యువత అర్హులన్నారు. ఎస్‌ఎస్‌సీ పాసయిన అభ్యర్థులతోపాటు పాలిటెక్నిక్, ఐటీఐ, బీఇ, బీఎస్సీ, బీఫార్మసీ, బీబీఏ వంటి డిగ్రీ ఉన్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9988853335, 8712655686 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

గూడెం డిపో తనిఖీ



సిబ్బందికి మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తున్న జిల్లా రవాణా అధికారి వరప్రసాద్

తాడేపల్లిగూడెం(టీఓసీ): జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్వీఆర్ వరప్రసాద్ గురువారం తాడేపల్లిగూడెం డిపోను సందర్శించారు. గ్యారేజీ సిబ్బందికి, కండక్టర్లు, డ్రైవర్లు, సూపర్‌వైజర్లకు, కార్యాలయం సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. వరప్రసాద్ మాట్లాడుతూ ప్రత్యేక బస్సులు, లోకల్ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణీకులకు అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా రోడ్డు మీద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెయింటెనెన్స్, మెకానికల్ సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పారు. సురక్షిత ప్రయాణం, ఇంధన పొదుపు, ఆదాయం తీసుకువచ్చిన డిపో సిబ్బందికి పలువురికి మెరిట్ సర్టిఫికెట్స్ అందజేశారు.

జూదాలపై 415 కేసుల నమోదు

భీమవరం: సంక్రాంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా కోడిపందేలు, పేకాట, గుండాట నిర్వాహకులపై 415 కేసులు నమోదు చేసి సుమారు రూ.7.35 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి గురువారం తెలిపారు. కోడి పందేల బరులపై 245 కేసులు నమోదు చేసి 545 మందిని అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి రూ.4.05 లక్షల నగదు, 239 కోళ్లు, 342 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. 103 పేకాట కేసులు నమోదు చేసి, 189 మందిని అరెస్ట్ చేయగా వారి నుంచి రూ.1.47 లక్షలు స్వాధీనం చేసుకోగా, 67 కేసులు నమోదు చేసి 236 మందిని అరెస్ట్ చేసి రూ.1.83 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు.

గ్రామీణ క్రీడల్ని ప్రోత్సహించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి, అడిషనల్ డీఎస్పీ భీమారావు

ఆకివీడు: గ్రామీణ క్రీడల్ని పండుగ రోజుల్లో ప్రభుత్వమే ప్రోత్సహించాలని, యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు వెళ్ళాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపీమూర్తి విజ్ఞప్తి చేశారు. సంక్రాంతి సందర్భంగా డీవైఎఫ్ఐ 42వ సంక్రాంతి పోటీల్లో వాలీబాల్ విజేతలకు గురువారం బహుమతులు అందజేశారు. మన సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, మన ప్రజా ప్రతినిధులు వీటిపై దృష్టి పెట్టాలన్నారు. అదనపు ఎస్పీ భీమారావు మాట్లాడుతూ 42 ఏళ్లుగా సంక్రాంతి క్రీడల్ని నిర్వహిస్తున్న డీవైఎఫ్ఐని అభినందించారు. క్రీడాకారులు తమ ప్రతిభతో క్రీడల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము, ఆహ్వాన సంఘ గౌరవాధ్యక్షుడు ఎండీ మదనీ, కార్యదర్శి డీ.రవితేజ, సభ్యులు పాల్గొన్నారు. తాడినాడ, ఆకివీడు టీంలు విన్నర్, రన్నర్‌గా నిలిచాయి.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లాలో చిల్డ్రన్ హోంలో ఖాళీగా ఉన్న పోస్టులకు కాంట్రాక్ట్, పార్ట్‌టైమ్ పద్ధతిలో పనిచేసేందుకు అర్హులైన స్థానిక మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈనెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ కార్యాలయం, కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణం రూము నెంబర్ 202లో స్వయంగా అందజేయలని సూచించారు. దరఖాస్తు తో పాటు సంబంధిత ధ్రువపత్రాలు, 4 నుండి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ, ఆధార్, నివాస ధృవీకరణ పత్రాలు జతపరచాలన్నారు.

నిరుద్యోగ సమస్య పరిష్కారంలో విఫలం



ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని అఖిల భారత యువజన సమైక్య (ఏఐవైఎఫ్) ఏలూరు జిల్లా కో కన్వీనర్ తొర్లపాటి రాజు విమర్శించారు. గురువారం ఏలూరు స్ఫూర్తి భవనంలో ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభల గోడపత్రికను నాయకులు ఆవిష్కరించారు. ఏఐవైఎఫ్ ఏలూరు జిల్లా కో కన్వీనర్ తొర్లపాటి రాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఎం.క్రాంతికుమార్ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల మందికి ఉపాధి కల్పిస్తామని 2014లో హామీ ఇచ్చిందని.. ఇంతవరకూ కనీసం రెండు లక్షల మందికి కూడా ఉపాధి కల్పించలేదని వారు విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చి ఏడు నెలలు కావస్తున్నా ఎలాంటి కార్యచరణకు ప్రయత్నించడం లేదని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు తాళ్లూరి నాగరాజు, జయరాజు, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎస్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

వేమన శత జయంతి ఉత్సవాలు ప్రారంభం



ఆరవల్లిలో మహిళా కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న జట్లు

అత్తిలి: యోగివేమన శత జయంతి ఉత్సవాలు అత్తిలి మండలం ఆరవల్లిలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా స్థాయి స్త్రీల కబడ్డీ టోర్నమెంట్ కోర్టును గ్రామ ప్రముఖుడు గొలుగూరి వెంకటరెడ్డి ప్రారంభించారు. సర్పంచ్ వెలగల సుస్మిత రెడ్డి, ఎంపీటీసీ దొమ్మేటి రమ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. జిల్లా నుంచి ఆరు టీంలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. కబడ్డీ క్రీడాకారులను పలువురు గ్రామ ప్రముఖులు పరిచయం చేసుకున్నారు. తొలి మ్యాచ్ తణుకు- జంగారెడ్డిగూడెం జట్ల మధ్య జరగ్గా జంగారెడ్డిగూడెం జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో అనంతపల్లి జట్టుపై ఉండి జట్టు విజయం సాధించినట్లు జిల్లా కబడ్డీ సెక్రటరీ శ్రీకాంత్ తెలిపారు. జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను రిటైర్డు డ్రిల్ మాస్టర్ వెలగల రామకృష్ణా రెడ్డి ప్రారంభించారు. జయంతి ఉత్సవం ఈ నెల 18న జరుగుతుందని కమిటీ చైర్మన్ వెలగల అమ్మి రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు సత్తి వెంకట శ్రీనివాసరెడ్డి, గొలుగూరి శ్రీరామా రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏలూరు జిల్లాకు ప్రధానమంత్రి అవార్డు

ఏలూరు(మెట్రో): ప్రైమ్ మినిస్టర్స్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ -2023 ఏలూరు జిల్లాకు లభించింది. కొత్తగా ఏర్పాటైన ఏలూరు జిల్లా కలెక్టర్‌గా రెండేళ్లు సేవలందించిన ప్రసన్న వెంకటేష్ కృషి ఫలితంగా అరుదైన అవార్డు లభించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందింది. వారి సమయంలో జిల్లాలో పౌర సేవలు, ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకు వెళ్ళారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల అమలులో భాగంగా రక్తహీనత నివారణకు ప్రాధాన్యత ఇచ్చారు. సామాజిక బాధ్యత కార్యక్రమం క్రింద ఏజెన్సీ మండలాల్లో ×అక్షజ్ఞ అనే కార్యక్రమాన్ని అమలు చేసి గర్భిణీ, బాలింతల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చారు. సుపరిపాలన అందించడం ద్వారా ఏలూరు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు లభించింది. దేశంలో 16 జిల్లాలను ఎంపిక చేయగా అందులో ఏలూరు జిల్లాకు స్థానం లభించింది.

గుంతల రోడ్లపై గళమెత్తిన ఎమ్మెల్యేలు

ఏలూరు(మెట్రో): జిల్లా సమీక్షా సమావేశం (డీపీఆర్‌సీ)లో గురువారం సమస్యలపై స్వపక్ష సభ్యులే విపక్ష అవతారం ఎత్తారు. ప్రజలకు ఏ సమాధానం చెప్పాలంటూ అధికారులపై విరుచుకుపడ్డారు. రోడ్లు బాగోలేవని.. ఎందుకు అనుకున్న సమయానికి పూర్తి చేయలేదని ఒకరు ప్రశ్నిస్తే, ఉచిత గ్యాస్‌బండల బుకింగ్‌లు, డెలివరీలకు వ్యత్యాసం ఎందుకు ఉందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ప్రశ్నించారు. గ్రామీణ తాగునీటి సరఫరా విభాగంలో అడ్డగోలుగా పనులను రద్దు చేయడంపై మరొకరు విరుచుకుపడ్డారు. ఇలా వివిధ సమస్యలపై జిల్లాలోని ఎమ్మెల్యేలు విరుచుకుపడ్డారు.

అజెండాలో రూపొందించిన అంశాల మేరకు నియోజకవర్గంలో ఎదుర్కొంటున్న సమస్యలను తెలపాలని ఎమ్మెల్యేలను ఇన్‌చార్జి మంత్రి ఆదేశించారు. ముందుగా పోలవరం ప్రాజెక్టు, పునరావాసం, భూ సేకరణ వంటి అంశాలపై ప్రారంభమైన చర్చ, వైద్యారోగ్య శాఖపై కొనసాగింది. పోలవరం ఎమ్మెల్యే జిల్లాలో పోలవరం ప్రాజెక్టు విషయంలో కూటమి ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా వ్యక్తిగత ప్యాకేజీ అందించిందని చెప్పుకొచ్చారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం త్వరలో ప్రత్యేకమైన సమావేశాన్ని నిర్వహించి ఆ సమావేశంలో నిర్వాసితులు ఎదుర్కొనే సమస్యలను తెలుసుకోవాలంటూ సూచించారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలాలు పరిశీలించాలని ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేసుకోవాలంటూ మంత్రి మనోహర్ సూచించారు.

కొల్లేరుపై గరం గరం

అనంతరం కొల్లేరుపై చర్చ మొదలు కాగా ప్రారంభం నుంచి చర్చ వాడీ వేడిగా సాగింది. కొల్లేరులో నివసించే ప్రజల జీవన స్థితిగతులను అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని, కనీసం తాత్కాలిక రోడ్లు సైతం కొల్లేరు గ్రామాలకు వెళ్లేందుకు ఎందుకు వేయలేకపోతున్నామంటూ కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అటవీశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ జయమంగళ కొల్లేరు సమస్యలపై చర్చించారు. అనంతరం జిల్లాలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందంటూ సభ్యులు ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా, సాక్షాత్తు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సైతం ఆర్అండ్‌బీ అధికారులు ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు.

కొండను తవ్వేస్తున్నారు



గుళ్లపూడి నుంచి దొరమామిడి వెళ్ళే రహదారిలో కొండను తవ్వేసిన దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన గుళ్లపూడి నుంచి దొరమామిడి వెళ్ళే రహదారిలో ఉన్న కొండను కొందరు వ్యక్తులు తవ్వేసి అక్రమంగా తరలిస్తున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొండలను గుల్ల చేస్తున్నారు. అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్నారనే సమాచారం ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికే గాడిదబోరు సమీపంలోని కొండతోపాటు పందిరిమామిడిగూడెం వెళ్ళే రహదారిలో ఉన్న కొండను కూడా కొల్లగొట్టి అక్రమంగా మట్టి రవాణా చేసినా కనీసం అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా కొండలను ఇష్టానుసారంగా తవ్వుతూ సొమ్ము చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషిచేద్దాం

కలెక్టర్ చదలవాడ నాగరాణి



జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి తదితరులు

భీమవరం (ప్రకాశంచౌక్): రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రారంభించారు. గోడపత్రిక, కరపత్రాలు, బ్యానర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహదారి భద్రతా నియమాలు, జాగ్రత్తలపై వివిధ వర్గాల ప్రజలకు, వాహన డ్రైవర్లకు విస్తృత స్థాయిలో అవగాహన కలిగించాలన్నారు. జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు నిర్వహించే మాసోత్సవాలలో భాగంగా వివిధ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇందుకు అధికారులంతా చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. జిల్లా రవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ కె.ఎస్.ఎన్.ప్రసాద్, భీమవరం ఆర్టీసీ డిపో మేనేజర్ పీఎస్‌వీఎం సత్య నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు చేయి కలుపుదాం

పశ్చిమగోదావరిని ప్లాస్టిక్ రహిత జిల్లాగా మార్చుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని కలెక్టర్ నాగరాణి అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ప్లాస్టిక్ నిషేధం కార్యాచరణపై డీఆర్‌డీఏ, డీపీఆర్‌ఓ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో నానాటికి పెరిగిపోతున్న ప్లాస్టిక్‌ను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్లాస్టిక్ వినియోగం కారణంగా తాగునీరు, ఆహారం కలుషితమై అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. ఇప్పటికే ఎన్నో ప్రయత్నాలు చేసి, ప్రజలకు అవగాహన కల్పించడంతో చాలా కొద్ది మొత్తంలోనే ప్లాస్టిక్‌ను నియంత్రించగలిగారన్నారు. కలెక్టరేట్ లో రానున్న సోమవారం నుంచి ప్లాస్టిక్ నియంత్రణ అమలుకు ఆదేశిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య ప్రాంతాల్లో గుడ్డ సంచులు, గాజు గ్లాసులు అమ్మకాలకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పెద్ద ఎత్తున అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహణకు అధికారులను ఆదేశించారు. డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డీపీఆర్‌ఓ టి.నాగేశ్వర రావు, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు పాల్గొన్నారు.

రైతులకు 'సాగర్' నీటి కష్టాలు

- రెండు నెలలు ఆలస్యమైనా ఇప్పటివరకు కానరాని సాగర్ జలాలు
- 70 వేల ఎకరాల ఆయకట్టు సాగు ప్రశ్నార్థకం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఆందోళన చెందుతున్న రైతులు

నూజివీడు: నియోజకవర్గంలో ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలో రబీ పంటలసాగుకు అవసరమైన సాగర్ జలాల సరఫరాపై ఈ ప్రాంతంలోని రైతాంగంలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. నూజివీడు బ్రాంచి కెనాల్ పరిధిలో ఉన్న నూజివీడు ప్రాంతానికి సాగర్ జలాలు షెడ్యూల్ ప్రకారం నవంబరు 15 నుంచే జరగాలి. ఇప్పటికే రెండు నెలలు ఆలస్యమైనా సాగర్‌జలాల సరఫరా విషయమై అధికార పార్టీ నాయకులు ఎవరూ పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు (ఎన్ఎస్పీ) మూడో జోన్ పరిధిలో నూజివీడు ప్రాంతం ఉంది. జోన్-3 కి నవంబరు 15 నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు సాగర్ జలాలను సరఫరా చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి నాగార్జునసాగర్ జలాశయం నుంచి సాగర్ జలాలను ఎన్టీఆర్ జిల్లా, ఏలూరు జిల్లాల పరిధిలో ఉన్న మూడో జోన్‌కు విడుదల చేయించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేయడం లేదు. దీంతో ఏలూరు జిల్లాలోని నూజివీడు బ్రాంచి కాలువ పరిధిలో ఉన్న నూజివీడు మేజర్, బాపులపాడు మేజర్, మాచవరం మేజర్ తదితర వాటి కింద మొత్తం 70 వేల ఎకరాల ఆయకట్టులో రైతులు సాగు చేసిన పంటలకు సాగునీటి సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. మూడో జోన్‌లోని ఆయకట్టుకు హక్కుగా రావాల్సిన సాగర్ జలాలను తీసుకురావాల్సిన బాధ్యత మంత్రి కొలుసు పార్థసారథిపై ఉందని రైతులు పేర్కొంటున్నారు. నియోజకవర్గంలోని ప్రజల ప్రధాన వృత్తి, ఆదాయ వనరు వ్యవసాయమే అయినప్పటికీ పాలకులు సాగునీరు గురించి పట్టించుకుంటున్న దాఖలాలే కనిపించడం లేదనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి.


నూజివీడు బ్రాంచి కెనాల్

వారం రోజులుగా మైలవరం బ్రాంచి కాలువకే..

మూడో జోన్‌లోని రెడ్డిగూడెం మండలం మద్దుల పర్వ వద్ద ఉన్న రెగ్యులేటర్ వద్దకు ఈనెల 6న సాగర్ జలాలు దాదాపు 200 క్యూసెక్కుల వరకు రాగా వాటిని ముందు నూజివీడు బ్రాంచి కాలువకు వదిలారు. అయితే వదిలిన సాగర్‌జలాలు కాలువకు అడుగడుగునా ఉన్న యూటీ రంధ్రాల ద్వారా సాగర్ జలాలన్నీ రెడ్డిగూడెం మండలంలోని చెరువుల్లోకే వెళ్లిపోయాయి. అంతేగాకుండా రెడ్డిగూడెం వద్ద ఉన్న ఎస్కేప్ గేట్‌ను రాత్రి సమయంలో రైతులు అక్రమంగా ఎత్తడంతో నూజివీడు బ్రాంచి కాలువలో సరఫరా అవుతున్న సాగర్ జలాలు రెడ్డిగూడెం కోతుల వాగు ద్వారా రంగాపురం పెద్ద చెరువుకు పోయాయి. దీంతో నూజివీడు ప్రాంతానికి చుక్క నీరు కూడా రాలేదు. ఇంతలోనే 9వ తేదీ ఉదయం నుంచి నూజివీడు బ్రాంచి కాలువకు సాగర్ జలాల సరఫరాను నిలిపివేసి మైలవరం బ్రాంచి కాలువకు వదిలారు. వారం రోజులుగా మైలవరం బ్రాంచి కాలువకే సాగర్ నీళ్లు వెళ్తున్నాయి.

పట్టించుకోని ప్రభుత్వం

రబీ సీజన్‌లో రైతులు మొక్కజొన్న, పత్తి, వేరుశనగ, మినుము తదితర పంటలను సాగు చేశారు. అలాగే పిందెదశలో ఉన్న మామిడి తోటలకు సైతం తేలికపాటి తడులు వేయాల్సిన అవసరం ఉంది. అంతేగాకుండా రాబోయేది వేసవి కాలం కాబట్టి ఈ ప్రాంతంలోని చెరువులన్నింటినీ సాగర్ జలాలతో నింపుకుంటేనే నూజివీడు ప్రాంతంలో మంచినీటి సమస్య లేకుండా ఉంటుంది. తమ ఇళ్లు గడవాలన్నా, పిల్లల చదువులకు ఫీజులు చెల్లించాలన్నా, రోగాలకు చికిత్స చేయించుకోవాలన్నా, మరేపని చేయాలన్నా ఈ ప్రాంత రైతులకు వ్యవసాయమే దిక్కుగా ఉన్న నేపథ్యంలో సాగర్ జలాలను తీసుకువచ్చేందుకు పాలకులు తీవ్రంగా ప్రయత్నించాల్సింది పోయి సమస్యను గాలికొదిలేశారు.

క్లుప్తంగా

నాల్గో రోజూ కాలుదువ్విన కోళ్లు


కలిగొట్లలో కోడిపందేలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మూడు రోజుల పాటు అడ్డూ అదుపు లేకుండా విచ్చలవిడిగా కోడిపందేలు, జూదం నిర్వహించారు. నాల్గవ రోజు గురువారం కూడా కొన్నిచోట్ల కోడి పందేలు నిర్వహించారు. ఉండి మండలం కలిగొట్లలో నిర్వాహకులు గురువారం ఉదయం ఓ పందెం నిర్వహించారు. దీంతో చుట్టుపక్కల సమాచారం అందుకున్న పందెం రాయుళ్లు పెద్ద ఎత్తున బరి వద్దకు చేరుకున్నారు. అయితే ఆ తరువాత పోలీసులు వస్తున్నారనే సమాచారం పందెంరాయుళ్లకు అందడంతో ఉడాయించారు. కొద్దిసేపటికి ఎస్సై ఎండీ నసీరుల్లా, సిబ్బందితో బరివద్దకు చేరుకుని కోడిపందాలు, జూదం వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుటామని హెచ్చరికలు చేశారు. ఉండి, మహదేవపట్నం గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో నాల్గవరోజు జూదం కొనసాగినట్లు సమాచారం.

వ్యక్తి కిడ్నాప్‌పై కేసు నమోదు

భీమవరం: పట్టణానికి చెందిన విశ్వనాథుని సత్యనారాయణ అనే వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారనే ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపట్టారు. మెంటేవారితోటకు చెందిన సత్యనారాయణ ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి దారుగా ఉన్నారు. అతని తల్లిదండ్రులను హైదరాబాద్‌కు పంపించేందుకు కుమారుడు సాయినాథ్‌తో కలిసి గురువారం టౌన్ రైల్వే స్టేషన్‌కు వచ్చారు. కారు దగ్గర సత్యనారాయణ ఉండగా అతని తల్లిదండ్రులు, కుమారుడు, రైల్వే స్టేషన్‌కి వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత సాయినాథ్ తిరిగొచ్చేసరికి సత్యనారాయణ కనిపించలేదు. స్థానికులను అడగ్గా ఎవరో నలుగురు వ్యక్తులు కారులో వచ్చి బలవంతంగా తీసుకెళ్లారని చెప్పడంతో చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇజ్రాయెల్ తెలిపారు.

మహిళపై దౌర్జన్యం

భీమవరం: తన ఇంట్లోకి ఓ వ్యక్తి అక్రమంగా ప్రవేశించి దుర్భాషలాడుతూ ఇంట్లోని విలువైన వస్తువులు ధ్వంసం చేశాడని భీమవరం ఒకటో పట్టణంలోని గునుపూడి పరిధికి చెందిన ఎం.లక్ష్మి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై బి.వై కిరణకుమార్ తెలిపారు. తనకు భోజనానికి ఇబ్బందిగా ఉందని, వండి పెడితే డబ్బులు ఇస్తానని టి.శ్రీనివాసు కోరగా బాధితురాలు అంగీకరించారు. ఇటీవల తనకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో వంట చేయలేనని చెప్పగా ఈ నెల 15న శ్రీనివాస్ తనపై దాడికి యత్నించడంతో పాటు వెంట తెచ్చుకున్న పెట్రోలు పోసుకుని చచ్చిపోతా, లేకపోతే చంపేస్తానంటూ భయభ్రాంతులకు గురిచేసినట్లు లక్ష్మి ఫిర్యాదులో పేర్కొంది.

అక్రమ కలప పట్టివేత


కలప తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్న ఫారెస్ట్ అధికారులు

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డినాగంపాలెం సమీపంలో అక్రమంగా మూలకాల కర్ర (వెదురు) కలపను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఎఫ్ఎస్ఓ బి. దినేష్ తెలిపారు. రాత్రి తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో బోలేరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అక్రమ కలప ఉన్నట్లు గుర్తించామని, వెంటనే వాహనాన్ని సీజ్ చేసినట్లు ఆయన చెప్పారు. ఈ తనిఖీల్లో కొవ్వాడ బీట్ ఎఫ్‌బీఓ ఎస్‌కే. పీముహద్దీన్, తదితరులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

నలుగురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

దెందులూరు: పెదపాడు మండలంలోని సత్యవోలు సచివాలయాన్ని గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ తనిఖీ చేశారు. ఉదయం 10.30 గంటలు దాటినా ఒక్క ఉద్యోగి కూడా హాజరు కాలేదు. ఈ విషయాన్ని పెదపాడు ఎంపీడీఓ, డీపీఓకు ఆమె తెలిపారు. ఉద్యోగుల్లో జవాబుదారీతనం పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వెంటనే డీపీఓ సత్యవోలు సచివాలయంలో నలుగురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు


నరసాపురంలో తలపడుతున్న ఆంధ్రా, హర్యానా మహిళల జట్లు

నరసాపురం: రుస్తుంబాదలోని గోగులమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయస్థాయి మహిళలు, పురుషులు ఇన్విటేషన్ కప్ కబడ్డీ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. ఈ పోటీల్లో లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జట్లు హోరాహోరీగా తలపడుతున్నాయి. గురువారం జరిగిన మ్యాచ్‌లకు సంబంధించి పురుషుల విభాగంలో ఆంధ్రా జట్టు, ఆర్మీ హైదరాబాద్ జట్టుపై 18 పాయింట్ల తేడాతో, హర్యానా జట్టు, నార్త్‌రైల్వే జట్టుపై 2 పాయింట్ల తేడాతో, మహారాష్ట్ర జట్టు యూపీపై 36 పాయింట్ల తేడాతో, మహిళల విభాగంలో ఆంధ్రా జట్టు హర్యానాపై 39 పాయింట్ల తేడాతో, వెస్ట్‌బెంగాల్ జట్టు బీహార్ జట్టుపై 42 పాయింట్ల తేడాతో, హిమాచల్‌ప్రదేశ్ జట్టు, కర్ణాటకపై 43 పాయింట్ల తేడాతో గెలుపొందాయి. మాజీమంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, పోటీల కన్వీనర్ కొత్తపల్లి జానకీరామ్, ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ సీఈవో వీ.వీర్లెంకయ్య, గుగ్గిలపు మురళి, వన్నెరెడ్డి శ్రీనివాస్ పోటీలను పర్యవేక్షిస్తున్నారు. శనివారం ఫైనల్స్, అనంతరం బహుమతి ప్రదానోత్సవం జరుగుతుంది. రెండు విభాగాల్లోను కలిపి గెలుపొందిన జట్లకు మొత్తం రూ.7.50 లక్షలు ప్రైజ్‌మనీ అందించనున్నారు.

గేదె దూడల పోషణలో జాగ్రత్తలు ఇలా

చింతలపూడి: పాడి పరిశ్రమలో గేదె పాలకు ఉన్న ప్రాముఖ్యత గురించి తెలిసిందే. కారణం గేదె పాలలో వెన్న శాతం అధికంగా ఉండటమే. పాల ధర నిర్ణయించడంలో వెన్న శాతాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. ఇందువల్ల ఆవు పాలకంటే గేదె పాలకు ధర ఎక్కువ పలుకుతుంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో రైతులు గేదెల పెంపకం పట్ల ఎక్కువ ఆసక్తి కనబరుస్తారు. మార్కెట్లో గేదెల ధర కూడా అవి ఇచ్చే పాల దిగుబడిపై ఆధారపడి ఉంటుంది. అధిక ధరతో పాడి గేదెలను కొనడానికి బదులు మేలు జాతి దూడలను తీసుకుని మంచి పాడి గేదెలుగా వృద్ధి చేసుకుంటే పశువుల కొనుగోలుకు అయ్యే వ్యయాన్ని తగ్గించుకోవచ్చు. మంచి దూడలను ఎంపిక చేసుకుని పోషణలో జాగ్రత్త వహిస్తే సకాలంలో ఎదకు వచ్చి 10 సంవత్సరాల్లో కనీసం 6 నుంచి 7 ఈతలు పొందవచ్చునని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె లింగయ్య రైతులకు సూచిస్తున్నారు.

పాడి - పంట

గర్భం నుంచే జాగ్రత్తలు

గేదె దూడల పోషణ తల్లి గర్భంలో ఉన్నప్పటి నుంచి ప్రారంభం కావాలి. చూడి గేదెలకు మంచి పోషకాహారం అందిస్తే ఆరోగ్యవంతమైన ఎక్కువ బరువు గల దూడలు పుట్టే అవకాశం ఉంది. చూడి చివరి మూడు నెలల కాలంలో గేదెల పోషణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి. దూడ పెరుగుదల చివరి మూడు నెలల్లోనే ఎక్కువగా ఉంటుంది. అందువల్ల గేదె తినగలిగినంత పచ్చి మేత, దాణ, ఖనిజ లవణాల మిశ్రమం అందించాలి. చూడి గేదెను ఈనడానికి రెండు వారాల ముందు నుంచి పాలు తీయకుండా వట్టిపోయేటట్లు చేయాలి. దీనివల్ల గేదె ముందు ఈతలో పాలివ్వడం ద్వారా కోల్పోయిన పోషక పదార్థాలను పొంది మరుసటి ఈతకు అధిక పాలను ఇస్తుంది.


మెట్ట ప్రాంతంలో డెయిరీలో రైతులు పెంచుతున్న గేదెలు

దూడ పుట్టిన తరువాత

దూడ పుట్టిన వెంటనే ముందు బరువు చూడాలి. పుట్టిన అరగంటలోపు తల్లి దగ్గర జున్ను పాలు తాగేలా చూడాలి. సాధారణంగా జున్ను పాలు తాగితే దూడలకు అజీర్తి చేస్తుందని, వాతం వస్తుందని అపోహ పడుతుంటారు. వాస్తవానికి జున్ను పాలలోని యాంటి బయాటిక్ పదార్థాలు దూడలను అంటు వ్యాధుల నుంచి రక్షిస్తాయి. జున్ను పాలలో విటమిన్ ఎ, ఖనిజ లవణాలు మామూలుగా కంటే మూడు రెట్లు అధికంగా ఉండి దూడల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. జున్ను పాలను దూడ బరువులో పదవ వంతు పరిమాణాన్ని లెక్కించి రోజులో మూడు లేదా నాలుగు సార్లు తాగించాలి.

దూడను వేరు చేసి పెంచే పద్ధతి

దూడను జున్ను పాలు తాగడం వరకు మూడు రోజులు తల్లి దగ్గర ఉంచి తరువాత తల్లి నుంచి వేరు చేసి పెంచే పద్ధతిని వీనింగ్ పద్ధతి అంటారు. ఈ పద్ధతి వల్ల దూడకు ఎంత పాలు ఇస్తున్నదీ తెలుసుకోవచ్చు. గేదె ఇచ్చే పాల దిగుబడి కూడా తెలుస్తుంది. ఏకారణం చేతనైనా దూడ చనిపోయినా గేదె పాలు ఇవ్వడం మానదు. వీనింగ్ పద్ధతిలో దూడలకు పాత్రలలో పోసిపాలు తాగించడం నేర్పాలి.


కె లింగయ్య, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్

దూడల పోషణ

దూడల శరీర బరువులో 10 శాతం పాలు ఒక నెల వరకు ఖచ్చితంగా ఇవ్వాలి. 15 రోజుల తరువాత బలవర్ధకమైన దూడల దాణా అందివ్వాలి. ఈ దాణా మొదటి నెలలో 150 గ్రాములతో మొదలుపెట్టి, మూడవ నెలలో 300 గ్రాములు, 4వ నెల నుంచి ఏడాది వరకు కిలో చొప్పున ఇవ్వాలి. కాయజాతి పశుగ్రాసాలైన అలసంద, లూసర్న్, పిల్లి పెసర వంటివి ఇస్తే మంచిది. వీటితో పాటు లేత పశుగ్రాసాన్ని అందుబాటులో ఉంచాలి. ఇలా పెంచిన దూడ ప్రతిరోజు 400 నుంచి 500 గ్రాములు బరువు పెరిగి ఏడాది కాలంలో 250 నుంచి 280 కిలోల బరువు పెరుగుతుంది. రైతులు పశు పోషణతో పాటు దూడలకు డీ వార్మింగ్ మందులు, వ్యాధి నిరోధక టీకాలను ఆయా వయస్సుకు తగినట్లు క్రమం తప్పకుండా ఇప్పించినట్లయితే దూడలు ఆరోగ్యంగా పెరిగి పాల ఉత్పత్తి బాగుంటుంది.

వ్యాన్ ఢీకొని మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

తాడేపల్లిగూడెం రూరల్: వ్యాన్ ఢీకొనడంతో ఓ మోటార్‌సైక్లిస్ట్‌కు గాయాలయ్యాయి. కొండ్రుప్రోలు గ్రామానికి చెందిన సూరపురెడ్డి కోదండరామ సుబ్రహ్మణ్యేశ్వరరావు ఉంగుటూరు మండలం నారాయణపురం ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. ఈ నెల 11న రాత్రి 6.45 గంటల ప్రాంతంలో ఫ్యాక్టరీ నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా పెదతాడేపల్లి మేకల సంత వద్ద బొలెరో వ్యాన్ మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. దీంతో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న కోదండరామ ఎడమ కాలికి గాయమైంది. దీనిపై గురువారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఏఎస్సై దుర్గారావు తెలిపారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుని సత్యం, ధర్మ మార్గాల్లో నడవడమే మానవ జన్మ సార్థకతకు మార్గ దర్శకాలని ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ ఆర్ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారిని మంత్రి శ్రీనివాస్ దంపతులు గురువారం దర్శించుకున్నారు. మందిర అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, కమిటీ సభ్యులు, అర్చకులు మంత్రి దంపతులచే ప్రత్యేక పూజలను నిర్వహించి ఆశీర్వచనం అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. అనంతరం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పంచారామక్షేత్రం శ్రీఉమా సోమేశ్వరస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.


మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

నూజివీడులో చోరీ

నూజివీడు: పట్టణంలోని హనుమాన్ జంక్షన్ రోడ్డులో ఉన్న శారదా ఆసుపత్రి సమీపంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. స్థానికంగా ప్రైవేటు స్కూల్‌లో పని చేస్తూ అద్దెకుంటున్న పాముల వెంకటరత్నం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి సెలవులకు ఊరు వెళ్లారు. గురువారం ఉదయం తలుపు తీసి ఉండటం చూసి పక్క పోర్షన్‌లో ఉంటున్న వారు వెంటనే వెంకటరత్నం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి ఇంటిలో చూసేసరికి వస్తువులన్ని చిందరవందరగా ఉండడంతోపాటు కాసున్నర నల్లపూసల గొలుసు మాయమైనట్లు గుర్తించారు. సీసీ పుటేజీలో దొంగ ఇంట్లోకి 12.55కు వెళ్లి తిరిగి 1.30 గంటలకు బయటకు వెళ్లినట్లుగా రికార్డయింది. బాధితులు పోలీసులకు సమాచారం అందించడంతో టౌన్ సీఐ పీ సత్య శ్రీనివాస్ ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఏలూరు నుంచి క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి క్షేత్రం భక్తులతో కిటకిట


శ్రీవారి ఆలయంలో భక్తులతో నిండిన దర్శనం క్యూలైన్లు


టోల్‌గేట్ మీదుగా శ్రీవారి కొండపైకి వెళుతున్న భక్తుల వాహనాలు

ద్వారకాతిరుమల: సంక్రాంతి పండుగ ముగిసింది.. సంప్రదాయ క్రీడలకు.. ఆట, పాటలకు తెరపడింది. దాంతో గురువారం ఉభయ గోదావరి జిల్లాల నుంచి సొంత ఊళ్లకు పయనమైన వారంతా మార్గమధ్యలోని ద్వారకాతిరుమల క్షేత్రాన్ని సందర్శించారు. ఈ నేపథ్యంలో సంక్రాంతి అతిథులతో శ్రీవారి ఆలయం కళకళలాడింది. మళ్లీ సంక్రాంతికి వస్తాం స్వామీ.. అంటూ వారంతా చినవెంకన్నను దర్శించుకున్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపంలో భక్తులు పోటెత్తారు. శ్రీవారిని దర్శించిన వారిలో ఎక్కువగా తెలంగాణ రాష్ట్రానికి వెళ్లే వారే కనిపించారు. వారి వాహనాలే ఎక్కువగా కొండపైకి వచ్చాయి. దాంతో టోల్‌గేట్ ప్రాంతంలో పెద్ద ఎత్తున వాహనాలు బారులు తీరాయి.

పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలి

మంత్రి నాదెండ్ల మనోహర్

ఏలూరు టౌన్: డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది సమన్వయంతో పని చేసి పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం ఏలూరులోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రెయినేజీ, సీసీ రోడ్లు, పంపు లీకేజీలకు సంబంధించి ఫిబ్రవరి 28 లోపు పనులు పూర్తి చేయాలని వైద్య విధాన పరిషత్ ఈఈని మంత్రి ఆదేశించారు. అదేవిధంగా కంటి విభాగాన్ని, ఐసీయూ మంత్రి తనిఖీ చేశారు. శ్యామ్ అనే వ్యక్తి మంత్రిని కలిసి తన భార్య అంగవైకల్యంతో మంచానపడి జీవిస్తుందని రూ.6 వేలు దివ్యాంగుల పెన్షన్ పొందుతున్నామని, దీని స్థానంలో రూ.15 వేలు పింఛను మంజూరు చేయించాలని మంత్రిని కోరగా అర్జీని తీసుకుని విచారణ చేయించాలన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడారు. ఆసుపత్రిలో డాక్టర్లు, నర్సింగ్ డిపార్ట్‌మెంట్ వారీగా ఖాళీలు ఉన్నాయని, పేషెంట్ తరఫున వీల్ చైర్స్, పరికరాలు, యంత్రాలకు సంబంధించి తర్వాత డీఆర్‌సీలో కలెక్టర్ వెట్రిసెల్వి ఆధ్వర్యంలో అవసరమైన చర్యలను తీసుకోవడానికి కృషి చేస్తామన్నారు. ఈ ఆసుపత్రికి గుండెకు సంబంధించిన వైద్యుల కోసం దాతల సహాయాన్ని కోరతామన్నారు. తనిఖీలో మంత్రి వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్‌రాజు, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, మాజీ ఎమ్మెల్యేలు గన్ని వీరాంజనేయులు, ఘంటా మురళి, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.


ఏలూరు జీజీహెచ్‌లో వైద్యసేవల గురించి రోగి బంధువులతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల

అగ్ని ప్రమాదంలో వ్యక్తి మృతి

- సజీవ దహనం కావడంతో ఏలూరులో కలకలం
- కారణాలపై పోలీసుల విచారణ

ఏలూరు టౌన్: అగ్ని ప్రమాదంలో ఒక వ్యక్తి సజీవ దహనం కావడం ఏలూరులో కలకలం రేపింది. ఇంట్లో మంటలు చెలరేగడంతో లోపల ఉన్న వ్యక్తి హాహాకారాలు చేస్తూ మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఏలూరు వన్ టౌన్ సీఐ సత్యనారాయణ పరిస్థితిని పరిశీలించారు. బాధితుల వివరాలు మేరకు.. ఏలూరు దక్షిణపు వీధి పెద్ద దేవుడి గుడి సమీపంలో నివాసం ఉంటున్న పద్మావతి ఏలూరులో సచివాలయంలో ఏఎన్ఎంగా పనిచేస్తోంది. ఆమె తమ్ముడు జానా గంగాధర్ (30) కాకినాడ జిల్లా అన్నవరంలో తల్లిదండ్రులతో కలసి ఉంటున్నాడు. గంగాధర్‌కు ఇంకా వివాహం కాలేదు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం ఏలూరులోని అక్క పద్మావతి ఇంటికి వచ్చాడు. గంగాధర్ ఇంటిలో పడుకుని ఉండగా.. పద్మావతి ఉద్యోగానికి వెళుతూ ఇంటితలుపు బయట గడియ పెట్టి వెళ్లింది. అయితే ఇంట్లో నీళ్ల కాసేందుకు పెట్టిన వాటర్ హీటర్ కాలిపోవడం, విద్యుదాఘాతం కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గంగాధర్ లేచి తలుపు తీసేందుకు ప్రయత్నించగా బయట గడియ పెట్టి ఉండటంతో వీలులేకుండాపోయింది. మంటలు చెలరేగడం, పొగ ఉక్కిరి బిక్కిరి చేయటంతో మంటల్లో చిక్కుకుని గంగాధర్ సజీవ దహనం అయ్యాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించారు.


సజీవ దహనమైన జానా గంగాధర్

ఎక్కడి చెత్త అక్కడే !

- పట్టణంలో కొరవడిన పారిశుద్ధ్యం
- పేరుకుపోయిన చెత్తకుప్పలు
- దుర్గంధంతో స్థానికులు సతమతం
- మురికివాడగా మారుతున్న వైనం
- చెత్త సేకరణలో ఏది చిత్తశుద్ధి
- గతంలో ఇంటి చెత్త నేరుగా కంపోస్టుకే..
- నేడు రోడ్లన్నీ చెత్తకు నిలయాలు
- ఇదెక్కడి పరిపాలన అంటున్న ప్రజానీకం



తణుకు సోమంచి వారి వీధిలో రోడ్డుపైనే చెత్త



తణుకు నంబరు 13 మునిసిపల్ పాఠశాల రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

తణుకు అర్బన్: వ్యాపార, వాణిజ్య, పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందిన తణుకు ప్రాంతం నేడు చెత్త చెదారాలకు నిలయంగా మారి దుర్వాసనకు, దుర్గంధానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పాలకుల నిర్లక్ష్యం , అధికారుల పర్యవేక్షణ లోపంతో పట్టణ ప్రాంతం చెత్తకు నిలయంగా మారిపోయింది. ఏ రహదారిలో చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయని, ప్రధాన సెంటర్‌లలో సైతం ఈ చెత్తకుప్పలు దిష్టిబొమ్మల మాదిరిగా కనిపిస్తున్నాయంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. ఖరీదైన భవనాలు మంచి ఆహ్లాదకర వాతావరణంతో నిండి ఉన్న కూడళ్లలో సైతం ఈ చెత్తకుప్పలు తిష్ట వేయడంతో రోజురోజుకూ తణుకు ప్రాంతం మురికివాడగా మారిపోతుందని నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే జిల్లా వ్యాప్తంగా మునిసిపాలిటీలపై తణుకు మునిసిపల్ కార్యాలయంలో అర్డీ రివ్యూచేసి తణుకు ప్రాంతంలో ఎక్కడ చూసినా రోడ్లపై చెత్త కనిపిస్తోందని మరోసారి ఇలా ఉంటే మీకు శాఖాపరంగా ఇబ్బందులు తప్పవని హెచ్చరించినా సమస్య పరిష్కారం కాలేని దుస్థితి. పాలకుల పరిపాలన కన్నా ఇతర విషయాలపై దృష్టి సారిస్తున్నారు కానీ ప్రజల సమస్యలు పట్టించుకునే స్థితిలో లేరని ప్రజల నుంచి విమర్శలు ఎదురవుతున్నాయి.

చెత్త సేకరణ చెత్తగా...

ఇంటి నుంచి వచ్చే చెత్త గతంలో వాహనాల ద్వారా నేరుగా కంపోస్టు యార్డుకు తరలేది. కానీ నేడు చెత్త సేకరణలో ఉన్న నిర్లక్ష్యం కారణంగా చెత్త రోడ్లపైనే వేయాల్సి వస్తున్న దుస్థితి. అంతేకాకుండా మునిసిపాలిటీ ఆధ్వర్యంలో సైతం నేడు పట్టణ పరిధిలో సైతం కొన్ని రహదారుల్లో పారిశుద్ధ్య కార్మికులే స్వయంగా డంపింగ్ చేయడం అనంతరం ట్రాక్టరులో తొలగించడం వంటి పరిస్థితులు నేడు నెలకొన్నాయి.

అదే ప్రాంతం.. అదే సిబ్బంది...

చెత్త సేకరణకు గత ప్రభుత్వం చాలా ప్రాధాన్యతను ఇచ్చే పరిస్థితి ఉండేది. గత ప్రభుత్వ హయాంలో ఉన్న మాదిరిగానే పట్టణ ప్రాంతం నేడు కూడా ఉండగా అప్పటి మాదిరిగానే పారిశుద్ధ్య సిబ్బంది, అధికార యంత్రాంగం విధుల్లో ఉన్నారు. మారిందల్లా కేవలం ప్రభుత్వమే అయినప్పటికీ నేడు చెత్త సేకరణలో లోపాలు బహిర్గతమవుతున్నాయి. తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించి నేరుగా కంపోస్టుకు తరలించే వెసులుబాటు అప్పట్లో ఉండగా నేడు మాత్రం అందుకు భిన్నంగా చెత్తలు రోడ్లపైనే తిష్ట వేయడం కారణంగా ఏర్పడిన దుర్గంధం ఆ ప్రాంతాన్ని దుర్వాసనతో ముంచెత్తుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతం నుంచి తణుకు 34 వార్డుల్లోను రోజుకు 50 టన్నులకుపైగా చెత్తను పారిశుద్ధ్య కార్మికులు సేకరించి కంపోస్టుకు తరలిస్తున్నారు. ఇందులో భాగంగా 8 ట్రాక్టర్లు, 25 ఆటోలు, నిత్యం కంపోస్టుకు చెత్తను మోసుకెళ్తున్నాయి. ప్రస్తుతం ఒక శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తోపాటు 9 మంది శానిటరీ మేస్త్రిలు, 165 మంది పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో ఉన్నారు. పాలకులు ఇకనైనా దృష్టిసారించి రోడ్లపై చెత్త కుప్పలు లేకుండా చూడాలని తణుకు ప్రజానీకం కోరుతున్నారు.



తణుకు రైల్వే స్టేషన్ రోడ్డులో..



తణుకు ప్రత్యూష థియేటర్ వీధిలో..



తణుకు బ్యాంక్ కాలనీలో వీధిలో..



టౌన్ హాల్ వెనుక వీధిలో రోడ్డుపై ఉన్న చెత్త

దువ్వలో అపూర్వ సమ్మేళనం



దువ్వలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికలో 1999 బ్యాచ్ విద్యార్థులు

తణుకు అర్బన్: ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాము..చదువులమ్మ చెట్టు నీడలో అంటూ ఒక సినీ కవి పాట రచిస్తే అందుకు తగినట్లుగా 1999 సంవత్సరానికి చెందిన తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన శ్రీముళ్లపూడి హరిచంద్ర ప్రసాద్ జిల్లా పరిషత్ పూర్వ విద్యార్థులు అంతా ఓ చోటకు చేరి గురువారం సందడి చేశారు. ఒకరి యోగక్షేమాలను మరొకరు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అప్పటి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శిరిగినేని సీతారామశాస్త్రి, విస్సె పంతులుతోపాటు ఉపాధ్యాయులు షేక్ ముస్తఫా, హనుమంతరావు, కృష్ణవేణి, ప్రసాద్, లక్ష్మి, పాండురంగారావు, భాస్కరరావులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ కమిటీ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కార్గో డెలివరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్ అశోక్‌వర్మ, ఎంపీడీవో జయసాగర్

తణుకు అర్బన్: ఆర్టీసీ కార్గో పార్సిల్స్ డోర్ డెలివరీ సేవలు వినియోగదారుల అభిమానాన్ని చూరగొన్నాయని తణుకు తహసీల్దార్ డి.అశోక్‌వర్మ అన్నారు. ఆర్టీసీ కార్గో కొరియర్ పార్సిల్ డోర్ డెలివరీ మాసోత్సవాల్లో భాగంగా మూడో వారం లక్కీ డిప్ మొదటి విజేతను వెల్లడించి మాట్లాడారు. సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ ఎంత సౌకర్యవంతమో అదే సేవలు పార్సిల్ డోర్ డెలివరీల్లోను అందుతున్నాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రెండో బహుమతి విజేతను తణుకు ఎంపీడీవో రాపాటి లోహిత్ జయసాగర్ ప్రకటించారు. విజేతలకు అందించిన బహుమతులను నరేష్ క్లాత్ షోరూమ్, షాలేమ్ పెన్ కార్నర్ అధినేతలు అందజేసినట్లు డిపో మేనేజర్ సప్పా గిరిధర్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ లాల్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వేమూరి దయాకర్, సూపరింటెండెంట్ వెన్నా రమణమూర్తి, గ్యారేజ్ ఇన్‌చార్జి గూడూరి శ్రీనివాస్, ఆయిల్ డిపో క్లర్కు మహ్మద్ అంజాద్ ఆలీ, జనరల్ అసిస్టెంట్ డిపో క్లర్కు చింతల రామకృష్ణ, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ ఉనికిలి నిత్య కల్యాణరాజరు, డిపో సిబ్బంది, కార్గో సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

పండుగ రోజుల్లో మురుగునీటి సరఫరా

ఆకివీడు : పండుగ రోజుల్లో మురుగునీరు కుళాయిల ద్వారా సరఫరా చేశారని జాతీయరహదారికి చేర్చి కైకలూరు వైపు ప్రాంతంలోని ప్రజలు వాపోతున్నారు. స్థానిక కెనరా బ్యాంక్ ప్రాంతం నుంచి ఎఫ్‌సీఐ వరకూ రోడ్డుకు ఇరువైపులా ఉన్న నివాసదారులకు మురుగునీరు సరఫరా అయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుళాయిల ద్వారా మురుగునీరు వస్తుందని ఫిర్యాదు చేసినప్పటికీ నగర పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతంలోని దత్త క్షత్రం వద్ద ఉన్న ఒక కాఫీ హోటల్‌కు సంబంధించిన మురుగునీటి పారుదల కోసం ఆ ప్రాంతంలో తవ్వగా కుళాయి పైపు పగిలి మురుగనీరు ప్రవేశించిందని ఆ ప్రాంత ప్రజలు చెప్పారు. కుళాయిల్లో మురుగునీటితో పాటు ఆ నీరు తీవ్ర దుర్గంధం వచ్చిందని పేర్కొంటున్నారు. గురువారం నాటికి కూడా పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు. ఇదే ప్రాంతంలో రోడ్డుకు మరో వైపు ఉన్న అపార్టుమెంట్ నుంచి మురుగునీరు నేరుగా జాతీయ రహదారిపైకి వచ్చి తీవ్ర దుర్గంధభరితంగా ఉంది. అపార్టుమెంట్‌నుండి వచ్చే మురుగునీటిపై నగర పంచాయతీ ఎలాంటి చర్యలూ చేపట్టకపోవడంతో ఆ ప్రాంతంలోని వ్యాపారస్తులు, స్థానికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు



జాతీయరహదారిపై నిలిచిన మురుగునీరు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

పోడూరు: నేటి విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని మాజీ ఎంపీటీసీ గోగులమండ విజయాదేవి పిలుపునిచ్చారు. జిన్నూరు పెదపేటలో సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక సంఘం, యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు గురువారం రాత్రి స్థానిక నాయకుల చేతులమీదుగా బహుమతులు అందజేశారు. స్థానిక బాలబాలికలకు, యువతకు జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో క్రీడా పోటీలు నిర్వహించారు. బహుమతి ప్రదానోత్సవంలో మాజీ ఎంపీటీసీ సభ్యురాలు విజయాదేవి మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రతిఏటా పెదపేటలో క్రీడాపోటీలు నిర్వహించడం ఎంతో ఆదర్శనీయమన్నారు. సొసైటీ మాజీ డైరెక్టర్ వడ్లపాటి శ్రీలక్ష్మి, వార్డుమెంబర్లు మేడిది నిర్మలకుమారి, కాటం రామదాసు, స్థానిక నాయకులు కాటం జయరాజు, గోగులమండ రత్నాజీ, పిల్లి పెంటయ్య పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడికి రూ. 10 వేల జరిమానా

తణుకు అర్బన్: బెల్ట్ షాపు నిర్వాహకుడికి ఇరగవరం తహసీల్దార్ ఎం.సుందరరాజు రూ.10వేలు జరిమానా విధించారు. తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఇరగవరం మండలం కత్తవపాడు గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న మురాల చిన్ని ఇరగవరం మండలం కత్తవపాడు గ్రామంలో అనధికారికంగా మద్యం బాటిల్స్ విక్రయిస్తూ గతంలో పట్టుబడిన మురాల చిన్ని అనే వ్యక్తిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో హాజరపరచగా బెల్ట్ షాపులు నిర్వహణ తదితర నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో ఉంటానని అతని నుంచి గతంలో సత్ప్రవర్తన కోసం 1 సంవత్సర కాలానికి బాండ్ తీసుకోవడం జరిగింది. అయితే అతను రాసిచ్చిన సత్ప్రవర్తన బాండును ఉల్లంఘిస్తూ ఈ నెల రెండవ తేదీన అనధికారికంగా మద్యం విక్రయిస్తూ 6 మద్యం బాటిల్స్‌తో తిరిగి తణుకు ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడటం జరిగింది. సదరు నిందితుడు చిన్ని సత్ప్రవర్తన బాండ్లను ఉల్లంఘించి అనధికారికంగా బెల్ట్ షాపులు నిర్వహించినందు వలన జరిమానా విధించినట్లు తెలిపారు. సదరు జరిమానాను నిందితుడు బుధవారం రూ.10వేలు చలానా రూపంలో చెల్లించడం జరిగింది. అనధికారికంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని, తణుకు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో తరచుగా నేరాలకు పాల్పడే వారిపై సంబంధిత తహసీల్దారు కోర్టులో బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామని, వాటిలో వారు రాసిచ్చిన సత్ప్రవర్తన బాండ్లను ఉల్లంఘించి తిరిగి నేరాలకు పాల్పడితే భారీ ఎత్తున జరిమానా లేదా జైలు శిక్ష తప్పదని సీఐ హెచ్చరించారు.

ఆటల పోటీలు అభినందనీయం



నవాబుపాలెం గ్రామంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: సంక్రాంతి తెలుగు వారి పండుగ అని, ఈ పండుగల పేరుతో విష సంస్కృతి ప్రబలుతుందని, ఈ క్రమంలో ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో గురువారం మండలంలోని నవాబుపాలెం గ్రామంలో ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు, రైతు సంఘం నాయకుడు పాలుపూరి సత్యనారాయణ, మహిళా సంఘం నాయకురాలు బంకురు యశోద, పాలుపూరి సత్యవతి మాట్లాడారు. ఆటల పోటీలకు గ్రామ పెద్దలు సహకరించాలని కోరారు. అనంతరం ముగ్గులు, కుర్చీలాట, పరుగు పందెం, లెమన్ అండ్ స్పూన్ తదితర పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రామ సర్పంచ్ మద్దుకూరి గంగాభవాని, మాజీ ఉప సర్పంచ్ మద్దుకూరి ధనరాజు, బత్తుల రాంబాబు, జనసేన నాయకులు బండి శ్రీనివాస్, వంగిడి రాంబాబు, ప్రజాసంఘాల నాయకులు కండెల్లి రమేష్, ఆర్.అనూష, బంకురు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



పెంటపాడులో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వెలమసంఘ ప్రతినిధులు

పెంటపాడు: మండలంలోని తాడేపల్లిగూడెం నియోజకవర్గ కొప్పువెలమ సంఘ క్యాలెండర్‌ను గురువారం పెంటపాడు సంగం మేడ వద్ద ఆవిష్కరించారు. సంఘ రాష్ట్ర నాయకులు కూనిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు కిలపర్తి వెంకటరావు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి దాసరి అప్పన్న, పెంటపాడు వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు బండారు వెంకట్రావు, ఉమ్మడి జిల్లా జనసేన మహిళా అధ్యక్షురాలు కశిరెడ్డి మధులత, కేబుల్ సంఘ నాయకులు శిరపరపు వెంకట్రావు, నక్కా అబ్బి, ఏవీఎస్, బండారు కరుణాకర్, కర్రి సత్యనారాయన తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీదేవి మహంకాళమ్మ తల్లి మహోత్సవాలు



జబర్దస్త్ స్కిట్

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక కొబ్బరితోటలో శ్రీ దేవి మహంకాళమ్మ తల్లి 45వ జాతర ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద సినీ టీవీ కళాకారులచే జబర్దస్త్, బీవీఆర్ కళా కేంద్రం వారిచే ట్రాక్ సింగింగ్ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో చిన్నారులు, మహిళలు, పెద్దలు హాజరైయారు. జబర్దస్ వినోదిని, అప్పారావు, నవీన్ రూపొందించిన కామెడీ స్కిట్లు ప్రేక్షకుల్ని అలరించాయి. జబర్దస్త్ కళాకారులను, ట్రాక్ సింగింగ్ కళాకారులను ప్రత్యేక ఆహ్వానితులు వైఎస్సార్ రైతుల విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం, గుండుబోగుల బలసులరావు, సత్యాసాయి సేవా సంఘం సభ్యులు ఆకుల నవీన్ బాబా, బీవీఆర్ వ్యవస్థాపకులు బుద్దాల వెంకట రామారావులు హాజరై సత్కరించారు. నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షుడు యెగ్గిన నాగబాబు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ముగిసిన రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు

ఆకివీడు: గ్రామీణ క్రీడలైన చెడుగుడు, కబడ్డీ పోటీలు డీవైఎఫ్ఐ లాంటి సంస్థలు నిర్వహించడం వల్లే ఇంకా వాటి మనుగడ ఉందని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు అంబటి రమేష్ చెప్పారు. సంక్రాంతి యువజనోత్సవాల్లో డీవైఎఫ్ఐ నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలు గురువారం ముగిశాయి. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రమేష్ మాట్లాడుతూ యువత క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. ప్రభుత్వాలు గ్రామీణ క్రీడలను ప్రాథమిక స్థాయి నుంచి శిక్షణ ఇవ్వాలన్నారు. క్రీడలతోనే అంతర్జాతీయ స్థాయిలో దేశ కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయన్నారు. ఎంతో మంది క్రీడాకారుల్ని ప్రోత్సహించి, వారి ప్రతిభను వెలికితీస్తున్న డీవైఎఫ్ఐ కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు కుంకట్ల దానయ్య, గంధం ఉమ, అట్లూరి రంగారావు, ఆహ్వాన సంఘ గౌరవాధ్యక్షులు ఎండీ.మదనీ, డీవైఎఫ్ఐ నాయకులు, ఆహ్వాన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

పాలకొల్లు అర్బన్: అంగన్‌వాడీ చిన్నారులకు ఇంటిని మరిపించేలా ఆట, పాటలతో కూడిన విద్యాబోధన అందిస్తూ వారికి రుచికరమైన భోజనాన్ని అందించాలని ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర సూచించారు. మండలంలోని చింతపర్రు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఇందిర సందర్శించి రికార్డులు పరిశీలించారు. అలాగే కిచెన్‌గార్డెన్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారులను పలు ప్రశ్నలు వేసి సమాధానం రాబట్టారు. సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి, అంగన్‌వాడీ టీచర్ జీవీఎస్ లక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రీడలపై యువత ఆసక్తి కనబర్చాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వడ్డి రఘురాం నాయుడు

తాడేపల్లిగూడెం రూరల్: క్రీడల పట్ల యువత ఆసక్తి కనబర్చాలని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం నాయుడు అన్నారు. గురువారం మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రఘురాం నాయుడు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని చాటుకోవాలన్నారు. జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, ఎమ్పీటీసీలు మార్లపూడి సుబ్బారావు, శంకర్, నాయకులు మాకరాజు సతీష్, గొర్రెల శ్రీను, కొండుబోయిన కృపావరం, డాక్టర్ నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ నిర్వాహకురాలు చెన్నా త్రికళ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు గురువారం జరిగిన అన్నసమారాధనలో ఆర్గనైజేషన్ సేవలను కొనియాడారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమానికి 200 కేజీలు బియ్యం, లార్డ్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్ హోంకు 150 కేజీలు బియ్యం, నిడదవోలు లెప్రసీ కాలనీకి 300 కేజీలు బియ్యం, మొత్తం 650 కేజీలు బియ్యం అందజేశారు. అదే విధంగా 64 మంది వృద్ధులకు నూతన వస్త్రాలతో పాటు అన్నసమారాధనకు సహకరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీ, వైఎస్సార్ సీపీ నాయకులు చెన్నా జనార్దనరావు, దాత వాణి, దుర్గా ప్రసాద్, నాగరాజు తదితరులు సేవా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

హరిబాబుకు పితృవియోగం



జద్దు రంగనాయకులు (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడేపల్లిగూడెం మండల అధ్యక్షుడు జద్దు హరిబాబు తండ్రి రంగనాయకులు (69) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఈయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. రెండవ కుమారుడు హరిబాబు. పోలీస్ శాఖలో రంగనాయకులు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. రంగనాయకులు మృతికి పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు సంతాపం ప్రకటించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు విద్యుత్ ఈఈ కే.నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో మాధవరం, ఉప్పరగూడెం, తాళ్లపాలెం గ్రామాలకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు రావిపాడులో అన్నసమారాధన

పెంటపాడు: మండలంలోని రావిపాడు గ్రామంలో ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయని, ప్రజలందరూ అమ్మవారిని దర్శించుకోవాలన్నారు. భక్తులు అమ్మవారి ప్రసాదం స్వీకరించాలని ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కోరారు.

కోడి పందేల స్థావరాలపై దాడులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వేర్వేరు గ్రామాల్లో కోడిపందేలపై దాడి చేసి, నలుగురిని అదుపులోకి తీసుకున్నట్టు రూరల్ పోలీసులు తెలిపారు. గురువారం వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వీరంపాలెం గ్రామ శివారు ఖాళీ స్థలంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు రూరల్ పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా ఇరువురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1600లు నగదు, రెండు కోడి పుంజులు, రెండు కోడికత్తులను స్వాధీనం చేసుకున్నట్టు రూరల్ పోలీసులు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, చినతాడేపల్లి శివారు ఖాళీ స్థలంలో కోడిపందేలు నిర్వహిస్తున్న ఇరువురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1600లు నగదు, రెండు కోడిపుంజులు, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ పోలీసులు వివరించారు.